క్లుప్తంగా

వినాయక మండపాల వద్ద అన్నదానం



పట్నంబజారు: వినాయక చవితి వేడుకల్లో భాగంగా పలు ప్రాంతాల్లోని చవితి పందిళ్లలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ప్రారంభించారు. 4వ డివిజన్ రెడ్లబజారు కన్నా యూత్ ఆధ్వర్యంలో, 13వ డివిజన్ మల్లెల కృష్ణ, దోర్నాల శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెహమూద్, కన్నా రాఘవరెడ్డి, రాజేష్, ఆదినారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, సాయి, అజిస్, రాజశేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, సాగర్, చంటి పాల్గొన్నారు.

వినాయకుని పూజల్లో తులసి ధర్మచరణ్



కొరిటెపాడు: అన్నదానం చేయడం మహాపుణ్యకార్యమని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ అన్నారు. స్థానిక గుజ్జనగుండ్లలోని ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద గణేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో గణపతి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మహా నైవేద్యం సమర్పించి, వేద పండితుల నుంచి ఆశీర్వచనం స్వీకరించిన అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్పదని అన్నారు. తొలి ఏడాది శ్రీ గణేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏడు వేల మందికి అన్నదానం చేయడం మంచి విషయంగా చెప్పారు.



నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నెహ్రూనగర్: విద్యుత్ లైన్ల మరమ్మతులు, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లు తొలగించేందుకు శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డెప్యూటీ ఈఈ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. విజయవాడ మెయిన్‌రోడ్డు, సీతారామనగర్, ఎన్టీఆర్ నగర్, అరుంధతి నగర్, మంగళదాస్‌నగర్, ఇజ్రాయేల్‌పేట, రాఘవనగర్, నవభారత్‌నగర్, వాసవినగర్, తారకరామనగర్, సాయినగర్, ఒమెగా హస్పిటల్ ఏరియా, గోరంట్ల, హోసన్నా మందిర్ ఏరియా, అన్నపూర్ణనగర్, లక్ష్మీనగర్, వెంకటేశ్వరకాలనీ, మల్లికార్జునపురం, ఇన్నర్ రింగ్ రోడ్డు వినియోగదారులు సహకరించాలని కోరారు.

గాంధీ పార్కు వద్ద బస్‌బే నిర్మాణ పనులు నిలుపుదల

నెహ్రూనగర్: గాంధీపార్కు వద్ద చేపట్టిన బస్‌బే నిర్మాణాన్ని పట్టణ ప్రణాళిక అధికారులు శుక్రవారం నిలుపుదల చేశారు. నిత్యం ట్రాఫిక్ రద్దీతో ఉండే గాంధీపార్కు వద్ద పరదలు కట్టుకుని గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రి శ్లాబ్ వేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్ రంగంలోకి దిగారు. దీనిపై సోషల్ మీడియాలో పలు విమర్శలు రావడంతో నగర పాలక సంస్థ అధికారులు సదరు నిర్మాణానికి సంబంధించి సెంట్రింగ్ చెక్కలను తొలగించారు. ఇది తాత్కాలికంగా ఆగుతుందో లేక... మరలా నిర్మాణానికి బీజం పడుతుందో వేచి చూడాల్సి ఉంది.

కౌలు రైతులను ఆదుకోవాలి

లక్ష్మీపురం: వరదల వలన పంట నష్టపోయిన కౌలురైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు కొరారు. స్థానిక బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం కౌలు రైతు సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎం.నాగమల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు.

సికిల్‌సెల్ ఆయువు తీస్తోంది..

- చిన్నారుల్లో జన్యుపరమైన లోపంతో వ్యాధి
- సెప్టెంబర్ అవగాహన మాసం



సికిల్‌సెల్ వ్యాధి అవగాహన పోస్టర్లు

గుంటూరు మెడికల్: సికిల్‌సెల్ వ్యాధి జన్యుపర కారణాలతో చిన్నారుల్లో వస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ఈ వ్యాధితో ప్రతి ఏడాది మూడులక్షల మంది పిల్లలు జన్మిస్తున్నారు. వ్యాధిపైలకు అవగాహన కల్పించేందుకు 1983 నుంచి ప్రతి ఏడాది సెప్టెంబర్ నెలను 'నేషనల్ సికిల్ సెల్ అవగాహన మాసం'గా నిర్వహిస్తున్నారు.

వ్యాధి ఎలా సోకుతుందంటే....

సికిల్‌సెల్ వ్యాధి జన్యుపర మార్పులతో వస్తోంది. సాధారణంగా ఎర్ర రక్త కణాలు గుండ్రంగా ఉంటాయి. ఇవి శరీరమంతా ప్రయాణిస్తూ శరీరంలోని వివిధ అవయవాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేస్తుంటాయి. ఎర్ర రక్త కణాల జీవిత కాలం 120 రోజులు. సికిల్‌సెల్ వ్యాధిసోకిన వారికి రక్త కణాలు వంపు తిరిగి కొడవలి ఆకారంలో ఉంటాయి. ఫలితంగా అవి శరీరంలోని రక్తనాళాల లోపలికి చొచ్చుకొని వెళ్లలేక ఇతర భాగాలకు ఆక్సిజన్‌ను తీసుకెళ్లలేవు. ఫలితంగా శరీర భాగాలకు ఆక్సిజన్ సరఫరా జరగక అవయవాలు పనిచేయక చిన్న వయస్సులోనే వ్యాధి సోకిన వారు మరణించే ప్రమాదం ఉంది. ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో ఈ వ్యాధి బాధితులు ఉన్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. రక్తంలోని ఒక జన్యువు సికిల్‌సెల్ గాను, మరొకటి మామూలుగా ఉంటే వీరిని సికిల్‌సెల్ క్యారీయర్లుగా పేర్కొంటారు. వీరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. కాని వీరికి పుట్టే పిల్లలు తీవ్ర అనారోగ్యంతో జన్మించి చిన్న వయస్సులోనే చనిపోతారు.

వ్యాధి లక్షణాలు...

సికిల్‌సెల్ వ్యాధి సోకిన వారిలో దీర్ఘకాలం కామెర్లు ఉంటాయి. రక్త హీనత ఏర్పడి శరీరం పాలిపోయి ఉంటుంది. కాళ్లు, చేతుల వేళ్లు వాపుతో వంకర్లు తిరిగిపోయి ఉంటాయి. నీరసం, తిమ్మిర్లు, డార్క్ ఐస్, చర్మం ముడతలు ఈవ్యాధి సోయిన వారిలో కనిపిస్తాయి. ఈవ్యాధి పుట్టినప్పటి నుంచి ఉంటుంది. శిశువు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. వయస్సు పెరిగే కొద్ది కనిపిస్తాయి. ఆక్సిజన్ సరఫరా సరిగా లేకపోవడంతో శరీరంలో ఏదైనా ఒక భాగంలో తీవ్రమైన నొప్పి కలుగుతోంది. కౌమార దశలో ఉన్నవారు, పెద్దవారు దీర్ఘకాలిక తీవ్ర నొప్పితో బాధపడుతూ ఉంటారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో బాధితులు...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సికిల్‌సెల్ బాధితులు ముగ్గురు ఉన్నారు. మూడేళ్ల క్రితం 21 మంది బాధితులు ఉండగా, చికిత్స పొందుతూ 17 మంది మృతి చెందారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారికి డాక్టర్ వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం ద్వారా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సికిల్‌సెల్ వ్యాధి బారిన పడిన వారికి ప్రతినెలా రూ.10 వేలు పెన్షన్ అందించి భరోసా కల్పించారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉన్నాయి...



సికిల్‌సెల్ వ్యాధి ఉందా లేదా అనే విషయాన్ని గర్భధారణ సమయంలో లేదా ప్రసూతి సమయంలో నిర్ధారిస్తారు. లోపం గల జన్యువు కలిగిన చరిత్ర ఉంటే పుట్టే బిడ్డకు వ్యాధి వచ్చే అవకాశం ఉంది. కంప్లీట్ బ్లడ్ సెల్, హిమోగ్లోబిన్ ఎలక్ట్రోపోరోసిస్, యూరిన్ ఎనాలసిస్, చెస్ట్ ఎక్సరే పరీక్షల ద్వారా సికిల్‌సెల్ వ్యాధిని నిర్ధారణ చేస్తారు. గర్భం దాల్చిన ప్రతిఒక్కరూ ముందస్తుగా ఈ పరీక్షలు చేయించుకోవడం మంచిది. సికిల్‌సెల్ క్యారియర్స్‌గా ఉన్నవారికి వివాహాలు చేయకుండా ఉండటం ద్వారా వ్యాధి బాధితులు జన్మించకుండా నివారించవచ్చు.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, స్త్రీ, ప్రసూతి, సంతాన సాఫల్య వైద్యనిపుణురాలు

జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు



వ్యాధి సోకిన చిన్నారులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నాం. ఖరీదైన మందులు అందించి కౌన్సెలింగ్ చేస్తున్నాం. బోన్ మ్యారో ఆపరేషన్ చేయించడం ద్వారా వ్యాధిని నివారించవచ్చు. చెన్నై, రాయవెల్లూరులో పిల్లలకు ఉచితంగా ఈ ఆపరేషన్లు చేస్తున్నారు. చిన్న వయస్సులోనే లక్షణాలు గుర్తించి తల్లిదండ్రులు వైద్యులను సంప్రదించడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయి.

– డాక్టర్ బి.రమేష్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, గుంటూరు జీజీహెచ్

ఆర్‌వీఆర్‌జేసీలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి లీలావతి, ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు రూరల్: ఉజ్వల భవిష్యత్‌కు విద్యార్థి దశ కీలకమని జిల్లా న్యాయసేవ అధికారి సంస్థ కార్యదర్శి, గుంటూరు డివిజన్ సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఇల్ ఎఫెక్ట్ ఆఫ్ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జడ్జి లీలావతి మాట్లాడుతూ జీవితంలో కళాశాల విద్యాభ్యాసం రోజులు మధుర జ్ఞాపకాలను నింపే విధంగా ఉండాలని సూచించారు. చట్టాలపై సమాజంలో ప్రతి ఒక్కరికి అవగాహనను విద్యార్థులు కల్పించాలని చెప్పారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా తాము ఎంచుకున్న కోర్సులలో నైపుణ్యావృద్ధి దిశగా రాణించాలన్నారు. సాంకేతిక మాధ్యమాల ద్వారా ప్రతి ఘటన త్వరితగతిన అందరికి చేరుతున్న సమయంలో ఎంతో జాగ్రత్తగా మెలగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

27న గుర్రం జాషువా జయంతి సభ

లక్ష్మీపురం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సభ ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ప్రచార కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీ వేత్త, పుస్తక సమీక్షకులు గుమ్మా సాంబశివరావు మరియు 'పాడుదమా స్వేచ్ఛా గీతం' గీత రచయిత గంటేడ గౌరునాయుడులకు జాషువా సాహిత్య పురస్కారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు ఈమని అప్పారావు, ఎం.ఎ.చిష్టి, కిరణ్, బెర్రగాని శ్రీనివాసరావు, ఎస్. పద్మ, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిమాన్వితంపై ఆధ్యాత్మిక ప్రవచనం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై శుక్రవారం మహిమాన్వితం- మహేశ్వరుని నామం ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సి.హెచ్.మస్తానయ్య, కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సాహితివేత్త, వ్యాఖ్యాత ఏవీకే సుజాత ప్రసంగించారు.

ఫర్నిచర్, లైఫ్‌స్టైల్ ఎక్స్‌పో ప్రారంభం



ఎక్స్‌పో ప్రారంభిస్తున్న నిర్వాహకులు

నగరంపాలెం: స్థానిక రింగ్‌రోడ్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో ఫర్నిచర్, లైఫ్‌స్టైల్ ఎక్స్‌పోను ప్రాంప్ట్ ట్రేడ్ ఫేర్స్ ఎండీ ఉదయ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. క్రౌన్ ఫర్నిచర్, కంఫర్ట్ ఫర్నిచర్, సిద్ధేశ్వరా ఫర్నిచర్, ఫర్నిచర్ విలేజ్, డీడీజైనోహబ్, మురుగన్ ఫైన్ ఆర్ట్స్, ఇన్‌ఫ్లూఎన్స్ ఫర్నిచర్, ఫర్నిచర్ పోయింట్ సంస్థల నిర్వాహకులు హాజరవ్వగా, 60 శాతం వరకు తగ్గింపు అమ్మకాలు ఉన్నాయని తెలిపారు. కర్వింగ్ సోఫాలు, లగ్జరీ సోఫాలు, రిక్‌లైనర్ సోఫాలు, టేక్‌వుడ్ మంచాలు, గార్డెన్ ఫర్నిచర్, డ్రస్ మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 500కుపైగా రకాల మోడల్స్ ఉన్నాయని, ఉదయం పదిన్నర నుంచి రాత్రి 8.30 వరకు ఎక్స్‌పో కొనసాగుతుందని అన్నారు. వివరాలకు 9361150255, 8825924372 సంప్రదించాలని కోరారు.

బస్టాండ్ వద్ద చిరువ్యాపారులపై దౌర్జన్యం



రోడ్డుపై బైఠాయించిన నిరసనకారులు

పట్నంబజారు: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద హోటల్ మధువన్ యాజమాన్యం అధికార పార్టీ నేతల అండదండలతో రెచ్చిపోయింది. వివరాలు.. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ బయట ప్రస్తుతం మధువన్ హోటల్ పక్కన ఖాజామొహిద్దీన్ అనే వ్యక్తి 25 ఏళ్లుగా చిన్న బడ్డి కొట్టు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నాడు. ఒకటో తేదీన కొంత మంది దుకాణం వద్దకు తీసియావేయాలని బెదిరించారు. తాను ఎప్పటి నుంచో ఉంటున్నాని చెప్పి ఖాజామొహిద్దీన్ దుకాణంలోకి కావాల్సిన సరుకులు నిమిత్తం బయటకు వెళ్లి వచ్చే సరికి షాపు ధ్వంసం చేశారు. అయితే ఈ పని చేసింది మధువన్ యజమాని దుగ్గినేని వెంకటేష్ అని తెలిసిన బాధితుడు అతడిని అడగగా చంపుతానంటూ.. బెదిరింపులకు దిగాడు. ఆమేరకు ఖాజామొహిద్దీన్ పాత గుంటూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రోడ్డును ఆక్రమించి మరీ...

మధువన్ హోటల్ యాజమాన్యం అడ్డదిడ్డంగా రోడ్డుపైనే ఇనుప కడ్డిలతో అడ్డుకట్టి పార్కింగ్ కోసం రోడ్డునే ఆక్రమించుకున్న పరిస్థితులు ఉన్నాయి. ఫుట్‌పాత్‌ను కూడా వారి సొంతానికి వాడేసుకుంటున్నారు.

చిరువ్యాపారుల సంఘం ఆందోళన..

చిరు వ్యాపారులపై మధువన్ యాజమాన్యం దాడులకు పాల్పడుతోందని ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడు షేక్ కరీం, చిరువ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో మధువన్ హోటల్ ఎదుట శుక్రవారం ఆందోళన దిగారు. దీంతో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. విద్యార్థి సంఘం నేతలను కూడా మీ అంతు తేలుస్తానంటూ.. మధువన్ యాజమాన్యం బెదిరింపులకు దిగటంతో విద్యార్థి నేతలు భగ్గుమన్నారు. హోటల్ ఎదుట రోడ్డుపై పడుకుని ఆందోళన చేపట్టారు. అనంతరం పోలీసులు వచ్చి తాము విచారిస్తామని చెప్పటంతో ఆందోళన విరమించారు. హోటల్ నిర్వాహకులపై ఎస్ఎస్‌యూఐ నేత కరీం కూడా పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హోటల్ ఎదుట ఆందోళన సమయంలో కవరేజ్‌కు వెళ్లిన మీడియాపైనే హోటల్ యాజమాన్యం విరుచుకుపడింది.

వరద బాధితుల నిధికి రూ.5 లక్షల విరాళం



గుంటూరు వెస్ట్: వరద బాధితుల నిధికి గుంటూరు జిల్లా కోల్డ్ స్టోరేజ్ యజమానుల సంఘం రూ. 5 లక్షల చెక్కును శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి అందజేసింది. వీరితోపాటు వెంకట రమణ ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.60 వేలు, కంచర్ల రామారావు రూ.25 వేలు చెక్కులను కలెక్టర్‌కు అందజేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పట్నంబజారు: మహిళ మెడలో నుంచి గొలుసు లాక్కొని వెళ్లిన ఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. విద్యానగర్‌కు చెందిన సి.హెచ్.అనంతలక్ష్మి ఈనెల 12వ తేదీ 3వలైనులో ఉన్న సాయిబాబా గుడికి వెళ్లి వేరే మహిళతో కలసి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈక్రమంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని గొలుసు లాక్కొని పరారయ్యాడు. సుమారు 30 గ్రాముల గొలుసు అపహరించుకు పోయాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గణిత అవధానంతో విశ్లేషణ నైపుణ్యాలు

గుంటూరు ఎడ్యుకేషన్: గణిత అవధానంతో ధారణశక్తి, విశ్లేషణ నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చునని గణిత అవధాని డాక్టర్ టీఎస్వీఎస్ సూర్యనారాయణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో గణితశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో గణిత అష్టావధానం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, కన్వీనర్ డాక్టర్ శ్రీకాంత్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ వేణుగోపాల్, గణిత శస్త్ర అధ్యాపకులు రామిరెడ్డి, గిరిజ పాల్గొన్నారు.

నగరంలో సినిమా చిత్రీకరణ ప్రారంభం



గుంటూరు మెడికల్: మెగా మూవీ అండ్ అసోసియేషన్ ఎస్.ఎస్.వి జ్ఞానకృష్ణ బ్యానర్‌లో వస్తున్న 'నిజమైన ప్రేమ ఎవరిది' చిత్రం చిత్రీకరణ శుక్రవారం గుంటూరు నగరంలో ప్రారంభమైంది. స్థానిక నగరంపాలెంలో ప్రారంభమైన కార్యక్రమానికి హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా ముఖ్య అతిథిగా విచ్చేసి పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పఠాన్ మస్తాన్, ప్రొడ్యూసర్ బి.గోపి, కెమెరమెన్ అనిల్ కుమార్, హర్షవర్ధన్, హీరోయిన్స్ పుష్ప, అఖిలారెడ్డి, హోప్‌విన్ హాస్పిటల్స్ మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నేతలతో సమావేశం



ఆటో యూనియన్ నేతలతో మాట్లాడుతున్న ఎంవీఐ గోపాల్ తదితరులు

సాక్షి ఎఫెక్ట్

పట్నంబజారు: ప్రయాణికుల నుంచి ఆటోవాలలు అధికంగా వసూలు చేస్తున్నారని శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన 'నిబంధనలు బేఖాతరు' కథనంపై ఆర్టీఏ అధికారులు స్పందించారు. స్వర్ణ భారతీనగర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో ఆటో యూనియన్ నేతలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గతంలో నిర్ణయించిన చార్జీలు కంటే అధికంగా వసూలు చేయకూడదని సూచించారు. దీనితో పాటు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని సూచించారు. ఆర్టీసీ, రైల్వేస్టేషన్ వచ్చే ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోలపై కేసులు నమోదు చేసి సీజ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎంవీఐలు ఎం.గోపాల్, మల్లీశ్వరి, సౌజన్య పాల్గొన్నారు.

అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు



అధికారులతో సమావేశమైన కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని గుంటూరు నగరంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో గుంటూరు నగరంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమ అమలుపై విభాగాధిపతులు, ఇతర అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో విజయవంతం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు. ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన కలిగించడం, ప్రోత్సహించడం జరుగుతుందని చెప్పారు. వార్డు సచివాలయాల వారీగా సామూహిక పరిశుభ్రత డ్రైవ్‌లను నిర్వహించాలని కోరారు. కార్యక్రమాల వారీగా జీఎంసీ అధికారులకు, నోడల్ అధికారులుకు విధులు కేటాయించాలన్నారు. నగరంలో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరాల నిర్వహణ చేపట్టడం జరుగుతుందని వివరించారు. సమావేశంలో ఎస్ఈ ఎం.శ్యాం సుందర్, సిటీ ప్లానర్ డి.రాంబాబు, ఎంహెచ్ఓ మధుసూదన్, తూర్పు ఎంహెచ్ఓ(ఇన్‌చార్జి) రామారావు, మేనేజర్ ప్రసాద్, ఏడీహెచ్ రామారావు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



ఎల్ఈడీ టీవీని అందిస్తున్న ఎమ్మెల్యే మాధవి

నగరంపాలెం: విద్య, వైద్య రంగంలో 'మానవత' సంస్థ చేపడుతున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బ్రాడీపేట 2/13లోని శ్రీ శారదాని కేతన్ విద్యా సంస్థకు శుక్రవారం డిజిటల్ తరగతుల సౌకర్యార్థం ఎల్ఈడీ టీవీని అందజేశారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ సంస్థ పక్షాన విద్య, వైద్య రంగాల్లో సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడం ప్రశంసనీయమని అన్నారు. ఇటువంటి సంస్థలు సమాజానికి చాలా అవసరమని పేర్కొన్నారు. సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు రాణించాలని అన్నారు. కష్టపడి చదివితే భవిష్యత్ బంగారు బాట అవుతుందని చెప్పారు. చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ సంస్థ నుంచి సమాజానికి మెరుగైన సేవలు అందిస్తామని అన్నారు. టీవీ దాత అయిన వోలు బ్రహ్మయ్య, సుందరరామయ్య, సాయికిరణ్, గురువారెడ్డి, సుబ్రహ్మణ్యం ధనుంజయరెడ్డి, శివాజీ సాంబశివరావు, ఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు ఉపాధ్యాయులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉపాధ్యాయులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు తెలిపారు. శుక్రవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ అరండల్‌పేట 10వ లైనులోని పిచ్చుకలగుంటలో ఆదివారం ఉదయం 9.00 గంటలకు క్రీడా పోటీలు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ ప్రారంభిస్తారని తెలిపారు. సాంస్కృతిక పోటీలు బ్రాడీపేట 2/6లోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించబడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, యు. రాజశేఖరరావు, సబ్ కమిటీ సభ్యులు కె. ప్రేమ్‌కుమార్, కె. ప్రభూజీ, ఎండీ షకీలా బేగం, బి. ప్రసాద్, గోపయ్య, పీడీ అశోక్ పాల్గొన్నారు.

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు బీజేపీ మైనార్టీ నేతల వినతి

గుంటూరు మెడికల్: నరసరావుపేట ఎంపీ, జాతీయ వక్ఫ్ పార్లమెంటరీ కమిటీ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలను శుక్రవారం గుంటూరులో బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ నేతృత్వంలో పలువురు మైనార్టీ నేతలు కలసి వక్ఫ్‌బోర్డు బిల్లు గురించి వివరించి వినతి పత్రం అందజేశారు. వక్ఫ్‌బోర్డు పేద ముస్లిం అభ్యున్నతికి ప్రవేశపెట్టిందని, దీనిని సక్రమంగా వినియోగించేలా చూడాలని కోరారు. వక్ఫ్‌బోర్డులో ఉన్న సమస్యలను శ్రీకృష్ణదేవరాయల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖుద్దూస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బాషా, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, షేక్ రఫీ, షేక్ కరీముల్లా, షేక్ మీరావలి, షేక్ మౌలాలి, షేక్ బిలాల్, షేక్ గౌస్ పీరా, షేక్ సాంబశివరావు, షేక్ బాషా ఉన్నారు.